క్లుప్తంగా

శ్రీవారిని దర్శించుకున్న విశ్వ


శ్రీవారి సేవలో మాజీ ఎమ్మెల్యే విశ్వ కుటుంబ సభ్యులు

ఉరవకొండ: మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి ఆదివారం కుటుంబ సమేతంగా తిరుమల వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. సతీమణి భువనేశ్వరి, తనయుడు వై.ప్రణయ్‌రెడ్డి, ఇతర కుటుంబ సభ్యులతో కలసి ఆయన వీఐపీ విరామ సమయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనం అనంతరం వేదపండితులు, అధికారులు స్వామి తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయం వెలుపల మాజీ ఎమ్మెల్యే విశ్వ మాట్లాడుతూ ఉరవకొండ నియోజకవర్గ ప్రజలు సుభిక్షంగా ఉండాలని స్వామి వారిని కోరామన్నారు.మాజీ ఎమ్మెల్యే వెంట పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వీరన్న ఉన్నారు.

సేవాగుణం అలవర్చుకోండి


ఆయుధం వాడకంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కూడేరు: ఎన్‌సీసీ క్యాడెట్లు సేవాగుణాన్ని అలవర్చుకోవాలని క్యాంప్ కమాండర్ కల్నల్ సందీప్ ముంద్రా సూచించారు. మండలంలోని బ్రాహ్మణపల్లి వద్ద ఉన్న ఎన్‌సీసీ నగర్‌లో 6 ఆంధ్ర బెటాలియన్ సీఏటీసీ–3 శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. ఆదివారం క్యాడెట్లకు వెపన్ వాడకం, ఫైరింగ్‌పై శిక్షణ ఇచ్చారు. కమాండర్ మాట్లాడుతూ ఏకాగ్రతను అలవర్చుకుంటే టార్గెట్‌ను పూర్తి చేయవచ్చన్నారు. ఫైరింగ్‌లో ప్రతిభ కనబరిచిన క్యాడెట్లను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు సుబేదార్ సుఖ్‌దేవ్ సింగ్, రాకేష్, కర్నూల్, అనంతపురం, నంద్యాల, సత్యసాయి జిల్లాలకు చెందిన 350 మంది క్యాడెట్లు పాల్గొన్నారు.

చేనేత పరిశ్రమ అభివృద్ధికి కృషి చేస్తా


చెంగల మహేశ్వరను సత్కరిస్తున్న దేవాంగ సంక్షేమ సంఘం నాయకులు

ఉరవకొండ: చేనేత పరిశ్రమ అభివృద్ధికి కృషి చేయడంతోపాటు కార్మికుల అభ్యున్నతికి పాటుపడుతానని వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం రాష్ట్ర నాయకులు, ఆల్‌ఇండియా వీవర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి చెంగల మహేశ్వర తెలిపారు. ఆదివారం అనంతపురం–బళ్లారి జాతీయ రహదారి వద్ద ఉన్న దేవాంగ ఫంక్షన్‌హాల్‌లో ఆల్‌ఇండియా వీవర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన ఆయనను దేవాంగ సంక్షేమ సంఘం, ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. దేవాంగ సంక్షేమ సంఘం నాయకులు మిడతల చంద్రమౌళి, ఎంసీ నాగభూషణం, మిడతల రాము, విశ్వనాథ్, నిమ్మల వెంకటరమణ తదితరులు మాట్లాడుతూ చెంగల మహేష్ ఆల్‌ఇండియా వీవర్స్ ఫెడరేషన్ కార్యదర్శిగా ఎంపిక కావడం గర్వంగా ఉందన్నారు. భవిష్యత్‌లో ఆయన మరెన్నో పదువులు అలంకరించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రెడ్డి ఆంజనేయులు, బాలచంద్ర, చంగల అమరేష్, దేవాంగ ఉద్యోగ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు, బాబు, సాధు శ్రీనివాసులు, జ్యోతి, చెంగల భోజరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


రైతు సంఘ సభ్యులకు చెక్కులు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

బొమ్మనహాళ్: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ రైతులందరూ పరస్పర సహాయక సహకార పరిమిత సంఘాలుగా తాము పండించిన పంటలతో లావాదేవీలు నిర్వహిస్తే నికరలాభాలు సాధించవచ్చని రైతు సంఘం అధ్యక్షులు భీమిరెడ్డి, వరప్రసాద్ సూచించారు. ఆదివారం మండలంలోని దుద్దేకుంటలో సరస్వతి రామకృష్ణ గోదాం వద్ద శ్రీదుగ్గెమ్మ తల్లి రైతు సంఘం ఆరో వార్షిక మహాసభను సంఘ నిర్వాహకుడు భీమిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా అంకంపల్లి, రామసాగరం, బోరంపల్లి, కొత్తపల్లి పరస్పర సంఘాల అధ్యక్షులు చౌదరి, ఆంజనేయులు, మంజునాథ, వెంకటేశులు,నిర్వాహక కమిటీ సభ్యుడు వరప్రసాద్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ శ్రీదుగ్గేమ్మ తల్లి పరస్పర సంఘం క్రింద 20 గ్రామాల్లో 1,842 మంది రైతులతో 17 సహకార సంఘాలు నడుస్తున్నాయన్నారు. ఏడాది వ్యవధిలో వేరుశనగ కొనుగోలు ప్రాసెసింగ్, విక్రయంతో సుమారు రూ.1,62,68,125 లావాదేవీలు నిర్వహించామన్నారు. లాభాలను రైతులకే అందిస్తున్నామన్నారు. రైతు సంఘాలు, పరస్పర మిత్ర సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ఓటర్ల లెక్క!

- 2024 జనవరి 5న తుది ఓటరు జాబితా
- ఆగస్టు 21 వరకు పునఃపరిశీలనకు శ్రీకారం

రాయదుర్గం: టీడీపీ హయాంలో అడ్డగోలుగా తయారుచేసిన ఓటరు జాబితాపై రాష్ట్ర ప్రభుత్వం పునఃపరిశీలన దిశగా అడుగులు వేసింది. నకిలీ ఓటర్లను ఏరివేసి.. పారదర్శకమైన జాబితా మాత్రమే అందుబాటులో ఉంచేందుకు కసరత్తు ముమ్మరం చేసింది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు డబుల్ ఎంట్రీలు, నకిలీ ఓట్లు, చనిపోయిన వారి ఓట్లు, ఒకే ఇంటి నెంబర్‌పై పదుల సంఖ్యలో ఓట్లు, డోర్ నంబర్లు లేనవి.. ఇలా అన్ని అంశాలపై పక్కాగా చేపట్టే సర్వే ప్రక్రియ గత శుక్రవారం నుంచి రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో అట్టహాసంగా ప్రారంభమైంది. గత టీడీపీ హయంలో దొంగ ఓట్లతో గద్దెనెక్కాలనే కుట్రతో ఆ పార్టీ అధినేత చంద్రబాబు ఆదేశాల మేరకు దిగువస్థాయి నేతలు ఓటర్ల జాబితాల్లోకి ఇష్టారాజ్యంగా బయట వ్యక్తుల పేర్లు చేర్చారనేది సర్వాత్రా చర్చ. ఆ సమయాన కొత్త డోర్ నెంబర్లు కేటాయించి ఒకే డోర్ నెంబర్‌పై వందలాది ఓట్లు నమోదు చేయడం, మరిన్ని ఓట్లకు డోర్ నెంబర్లే లేకుండా పోవడం వంటి అవకతవకలు ప్రస్తుత జాబితాలో స్పష్టంగా దర్శనమిస్తున్నాయి.


ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితా పరిశీలిస్తున్న సచివాలయ ఉద్యోగి

మూడు నియోజకవర్గాల్లో ..

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని 813 పోలింగ్ కేంద్రాలు ఉండగా వాటి పరిధిలో మొత్తం 6,92,107 ఓటర్లు ఉన్నారు. ఇందులో 3,46,292 మంది పురుషులు, 3,45,760 మంది మహిళలు ఉన్నారు. వీటిలో తాజా సర్వే ద్వారా ఒకే డోర్ నెంబర్ పై ఉన్న ఓట్లెన్ని..? డోర్ నంబర్ లేని ఓట్లెన్ని..? పదికి పైగా ఉండే ఓటర్ల వివరాలు..? ఫొటోలు సరిగ్గా లేనివి..? గుర్తించే ప్రక్రియ మొదలైంది. క్షేత్రస్థాయిలో బీఎల్‌ఓలు, రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొంటున్నారు. ఈ సర్వే సాగుతున్న విధానంపై ఆయా మండలాల్లో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్లు శుక్రవారం ముమ్మరంగా పర్యవేక్షణ చేపట్టారు.

ఓటర్ల వివరాలిలా..

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	మొత్తం ఓటర్లు
రాయదుర్గం	293	2,54,392
కళ్యాణదుర్గం	261	2,22,234
ఉరవకొండ	259	2,15,481

ఇంటింటికీ బీఎల్‌ఓలు

- జూలై 1 నుంచి ఆగస్టు 21 వరకు బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి చేర్పులు, మార్పులు గుర్తిస్తారు. తప్పులు ఉన్నట్టయితే సెల్‌ఫోన్‌లో నమోదు చేస్తారు.
- ఆగస్టు 22 నుంచి సెప్టెంబర్ 29 వరకూ పోలింగ్ కేందాల క్రమబద్ధీకరణ, మౌలిక వసతుల కల్పనపై దృష్టి పెడుతారు.
- అక్టోబర్ 17 నుంచి నవంబర్ 30 వరకూ ఓటర్ల చేర్పులు, అభ్యంతరాల పై దరఖాస్తుల స్వీకరణ
- డిసెంబర్ 26లోపు చేర్పులు, తొలగింపులు, ఇతర క్లెయిమ్‌లు పరిష్కరిస్తారు.


ఓటరు జాబితా

- 2024 జనవరి 1న జాబితాల తుది పరిశీలన
- 2024 జనవరి 5న తుది ఓటర్ల జాబితా విడుదల చేస్తారు.

పారదర్శకంగా ఓటరు జాబితా



ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పారదర్శకంగా ఓటరు జాబితా రూపొందిస్తున్నాం. డోర్ నంబర్, ఆ ఇంట్లో ఉండే ఓట్లెన్ని, వారు ఎక్కడెక్కడ నివాసం ఉంటున్నారు..? అనే విషయాలు స్పష్టంగా తెలుసుకునేలా ఇంటింటా సర్వే చేపట్టాం. నేటి నుంచి వచ్చే 21 వరకూ బీఎల్‌ఓలు, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు దీనిపై పూర్తిస్థాయిలో కసరత్తు మొదలుపెట్టారు. పొరపాట్లకు తావివ్వకుండా పారదర్శకమైన జాబితా తాయరు చేసేలా చర్యలు చేపట్టాం.

– నిషాంత్‌రెడ్డి, ఆర్డీఓ, కళ్యాణదుర్గం

నేడు 'జగనన్న సురక్ష'

ఉరవకొండ: మండలంలోని వెలిగొండ గ్రామంలో సోమవారం ఉదయం 10 గంటలకు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వరలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. అధికారులు, సచివాలయ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

గుమ్మఘట్ట: మండలంలోని పూలకుంట ప్రభుత్వ పాఠశాలలో గ్రామ వికాస సమితి ఆధ్వర్యంలో సక్షమ్ సహకారంతో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 300 మంది రోగులకు కంటి, గుండె, దంత, చిన్నపిల్లలు వైద్యులచే చికిత్సలు నిర్వహించారు. ఇందులో 80 మందిని కంటి శస్త్రచికిత్స నిమిత్తం అనంతపురానికి తరలించారు. కార్యక్రమంలో గ్రామవికాస్ ప్రముఖులు సోమశేఖర్‌రెడ్డి, వైద్యులు అమర్‌మహేష్, కృష్ణాసామ్యరెడ్డి, భానుకిరణ్, క్రిష్ణమూర్తి, ఉషారాణి, వెంకటరమణారెడ్డి, శారదాదేవి తదితరులు పాల్గొన్నారు.

25న విద్యాసంస్థల బంద్

రాయదుర్గంటౌన్: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 25న విద్యాసంస్థల బంద్ నిర్వహించనున్నట్లు ఏఐఎస్‌ఎఫ్ అధ్యక్షుడు అంజి, ఏఐవైఎఫ్ ప్రధాన కార్యదర్శి కొ్రటేష్ తెలిపారు. ఆరు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బంద్ చేపడతామన్నారు. సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో సమస్యల పరిష్కారంతోపాటు విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇతర సమస్యలు పరిష్కరించాలనే ప్రధాన డిమాండ్లతో బంద్ నిర్వహిస్తామన్నారు.

ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధంగా ఉండాలి


మాట్లాడుతున్న మంత్రి కేవీ ఉషశ్రీచరణ్

కళ్యాణదుర్గం: ఎన్నికలు ఎప్పుడొచ్చినా పార్టీశ్రేణులు సిద్ధంగా ఉండాలని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ సూచించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గంలోని పార్టీ జేసీఎస్ కన్వీనర్లు, పార్టీ ముఖ్య నాయకులు, బూత్ కన్వీనర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా మండలాల్లో గ్రామాల వారీగా బూత్‌స్థాయిలో చేపట్టాల్సిన పనులపై ఆమె వివరించారు. గ్రామాల్లో స్థానిక నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ద్వారా అందిన లబ్ధిని వివరించాలన్నారు. రానున్న రోజుల్లో సంక్షేమ కాలెండర్ మేరకు ఆయా కుటుంబాలకు అందే సంక్షేమాన్ని తెలియజేయాలన్నారు. జూలై నెలలో ప్రజలకు అందించే పథకాలను వివరించాలన్నారు. ప్రభుత్వం ద్వారా ప్రతి కుటుంబానికీ లబ్ధి అందిన విషయాన్ని గుర్తించేలా తెలియజేయాలన్నారు. అనంతరం పార్టీ మరింత పటిష్టం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై నాయకులకు వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ గోపారం శ్రీనివాసులు, మండల కన్వీనర్ సర్వోత్తమ, జేసీఎస్ కన్వీనర్లు అర్చన, పెరుగు తిమ్మరాజు, చంద్రశేఖర్‌రెడ్డి, గంగాధర్, రాము,ఆయా గ్రామాల ముఖ్య నాయకులు, బూత్ కన్వీనర్లు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

ఉరవకొండ: పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, జిల్లా అడిషనల్ ఎస్పీ హనమంతు పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని నింబగల్లు గ్రామంలో బ్రహ్మర్షి పితా మహ ప్రతీజీ మహాపరినిర్వాణ వేడుకలను పురస్కరించుకుని అనంత ప్రకృతి ఫౌండేషన్, యోగి వేమన పిరిమిడ్ ధ్యాన కేంద్రం సంయుక్తంగా పత్రీజీ ధ్యానవనం అనే మోగా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఆదోని చౌకి మఠం పీఠాధిపతి, నింబగల్లు వీరశైవ మఠం పీఠాధిపతి కళ్యాణస్వామిజీ, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, అడిషనల్ ఎస్పీ హనుమంతు హాజరై నాలుగు ఎకరాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించే బాధ్యతను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జైకిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నాగమల్లి ఓబుళేసు, సీనియర్ పిరిమిడ్ మాస్టర్లు మురళీధర్, రఘునాథ్‌రెడ్డి, హనమంతరావు, లీలావతి, విజయ్ కుమార్, శివకుమార్ పాల్గొన్నారు.


ఉరవకొండ: మొక్క నాటుతున్న జెడ్పీ చైర్‌పర్సన్, అడిషనల్ ఎస్పీ, కళ్యాణస్వామిజీ

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

కుందుర్పి: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ఏఆర్ జిల్లా అడిషనల్ ఎస్పీ హనుమంతు, ఏజీఎస్ రెడ్డి ఫౌండేషన్ చైర్మన్ ప్రవీణ అన్నారు. ఆదివారం వైఎస్సార్‌సీపీ మండల మాజీ కన్వీనర్ ఎస్కే ఆంజనేయులు వర్ధంతి సందర్భంగా ఎస్కే చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా వెయ్యి మొక్కలు నాటారు. అంతకుముందు 2,000 మంది విద్యార్థులతో ఆ సంస్థ వ్యవస్థాపకుడు లెనిన్ బాబు పర్యవేక్షణలో సిబ్బందితో కుందుర్పిలో ర్యాలీ నిర్వహించి మొక్కల పెంపకంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గుంటూరు పారిశ్రామిక వేత్త భూపాల్, ఫర్ పీపుల్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ డీఎస్.మూర్తి, ప్రముఖ రచయిత్రి శశికళ,అనంతపురం అష్టావధాని గురువేపల్లి నరసింహులు, పుట్టపర్తి జిల్లా పర్యావరణవేత లేపాక్షి తదితరులు పాల్గొన్నారు.

లోఓల్టేజీ సమస్యకు చెక్

డి హీరేహాళ్(రాయదుర్గం): డి హీరేహాళ్ మండలంలోని హొసగుడ్డంలో లోఓల్టేజీ సమస్యకు చెక్ పడింది. శివారు కాలనీలోని 100 కుటుంబాలు అనేక ఏళ్ల నుంచి లోఓల్టేజీ విద్యుత్ సరఫరా తో సతమతమవుతున్నాయి. గత టీడీపీ హయాంలో మాజీ మంత్రి కాలవ శ్రీనివాసుల దృష్టికి ఈ సమస్యను పలుమార్లు తీసుకెళ్లినా పట్టించుకోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామాన్ని సందర్శించిన విప్ కాపు రామచంద్రారెడ్డి దృష్టికి లోఓల్టేజీ సమస్యను ఎంపీటీసీ శివలింగప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు తీసుకెళ్లారు. సత్వరం స్పందించిన విప్ విద్యుత్‌శాఖ అధికారులతో ఎస్టిమెట్ సిద్ధం చేయించారు. నెల రోజుల వ్యవధిలోనే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కృషి చేసి దీర్ఘకాలిక సమస్యకు స్వస్తి పలికారు.

'మణిపూర్ సీఎం రాజీనామా చేయాలి'

రాయదుర్గంటౌన్: మణిపూర్‌లో జరుగుతున్న అరాచకాలు, హత్యలకు బాధ్యత వహిస్తూ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి వెంటనే రాజీనామా చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి నాగార్జున డిమాండ్ చేశారు. పార్టీ నాయకులతో కలిసి ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మణిపూర్‌లో జరుగుతున్న హింసాత్మక ఘటనలు దారుణమన్నారు. రాజకీయ లబ్ధి కోసం బీజేపీ గిరిజన తెగల మధ్య చిచ్చు పెడుతోందన్నారు. సభ్య సమాజం తలదించుకునేలా మణిపూర్‌లో ఘటనలు చోటు చేసుకుంటున్నాయన్నారు. మణిపూర్‌లో హింసాత్మక ఘటనలకు పాల్పడుతున్న దోషులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

మహా మోసగాళ్లను నమ్మొద్దు


వర్షంలోనే లబ్ధిదారుకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గం రూరల్: ప్రజలకు మంచి చేస్తున్న ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్న మహామోసగాళ్లను నమ్మొద్దని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి సూచించారు. మండలంలోని గ్రామదట్ల గ్రామంలో రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, జెడ్పీటీసీ హొన్నే మల్లికార్జునతో కలిసి ఆయన ఆదివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. చిరుజల్లులు కురుస్తున్నా విప్ ఇంటింటికీ వెళ్లి బుక్‌లెట్ అందజేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమన్నారు. చంద్రబాబు అలవి కాని హామీలతో అన్ని వర్గాల ప్రజలను వంచించారన్నారు. ముఖ్యంగా రైతుల రుణాలన్నీ భేషరతుగా మాఫీ చేస్తానని, బ్యాంకుల్లో తాకట్టు పెట్టిన బంగారం విడిపించి అక్కాచెల్లెమ్మల ఒడిలో పెడతానని చెప్పిన చంద్రబాబు గెలిపించిన తరువాత మాట మార్చి డ్వాక్రా మహిళలకు ద్రోహం చేశాడన్నారు. టీడీపీ హయాంలో ఎన్నో అరాచకాలు జరిగినా, రూ.కోట్లు నిధులు టీడీపీ నాయకుల జేబుల్లోకి వెళ్లినా ప్రశ్నించని పావలా కళ్యాణ్ నేడు సుపరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రిపై ఆరోపణలు చేయడం దురదృష్టకరమన్నారు. నియోజకవర్గంలో కాలవ శ్రీనివాసులు కూడా తక్కువేమీ తినలేదన్నారు. చంద్రబాబు శేరు అంటే ఈయన సవాశేరు అనే పద్ధతిలో దోచుకున్నాడన్నారు. దోపిడీదారులైన మాయమాటలు నమ్మి మోసపోవద్దని అక్కాచెల్లెమ్మలకు విప్ సూచించారు. మీ ఆర్థిక సాధికారత కోసం పాటుపడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని రాబోవు ఎన్నికల్లో గెలిపించుకుని, రెట్టింపు సంక్షేమం పొందాలని కోరారు. కార్యక్రమంలో బోర్‌వెల్ నాగిరెడ్డి, పాటిల్ రఘునాథ్‌రెడ్డి, గౌని ప్రతాప్‌రెడ్డి, క్రిష్టారెడ్డి, సుధాకర్ రెడ్డి, గౌరన్నగారి నాగిరెడ్డి, కావలి రాజశేఖర్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, జింకల శ్రీనివాస్‌రెడ్డి, స్టోర్ డీలర్ పాతన్న, రామాంజనేయులు, గంగాధర, గొల్లబడప్ప, గొల్ల బొజ్జప్ప, వీరాపురం మహేష్, డాక్టర్ గంగాధర, కె.ఆంజనేయులు, వై.బొమ్మయ్య, ఎంపీడీఓ కొండయ్య, ఆర్ఐ జీవన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు టి.వీరాపురంలో..

మండలంలోని టి.వీరాపురంలో సోమవారం ఉదయం 6.30 గంటలకు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి నేతృత్వంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ హొన్నే మల్లికార్జున, ఎంపీపీ విద్యావతి, ఎంపీడీఓ కొండయ్య ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

అభివృద్ధి పనుల నిర్వహణపై నేడు సమీక్ష

బొమ్మనహాళ్: మండలంలోని గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులకు రూ.60 లక్షలు మంజూరయ్యాయని, పనుల ప్రతిపాదనలకు సంబంధించి ప్రజా ప్రతినిధులు, అధికారులతో సోమవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు హాజరై తీర్మానాలతో హాజరు కావాలన్నారు. మండలంలో అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేద్దామని ఎంపీడీఓ సూచించారు.


జయంతి కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

రాయదుర్గం: పట్టణంలోని జయంతి రుద్రయ్య శెట్టి వసతి గృహంలో ఉంటూ 1985–86లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని ఆనందంగా గడిపారు. ఇందుకు కారకులైన జయంతి రామగోపాల్ కృష్ణయ్యశెట్టి, సుబ్రమణ్యం శెట్టి దంపతులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

ప్రారంభమైన మొహర్రం సందడి

రాయదుర్గంటౌన్: మతసామరస్యానికి ప్రతీకయిన మొహర్రం వేడుకలు రాయదుర్గంలో భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. 26వ తేదీ చిన్న సరిగెత్తు, 29వ తేదీ పానకాల సమర్పణ, పెద్ద సరిగెత్తు, 30వ తేదీ ఆదివారం జలధి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉచ్చుబాయి, గొందిబావిలోని పెద్దపీర్లు, బళ్లారి రోడ్డులోని చమ్మా మకాన్, ఆత్మకూరు వీధిలోని నింబూసా, లడ్డు పీర్ల మకాన్ ప్రాంతాల్లోని చావిడిల్లో పీర్లను భక్తులు దర్శించుకున్నారు.

గుమ్మఘట్ట: మండలంలోని కలుగోడు, గుమ్మఘట్ట, గోనబావి, తాళ్లకెర, గలగల, గొల్లపల్లి, భూపసముద్రం, మారెంపల్లి, నేత్రపల్లి, 75 వీరాపురం గ్రామాల్లో మొహర్రం వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 29, 30 తేదీల్లో పెద్ద సరిగెత్తు నిర్వహించనున్నట్లు ఆయా గ్రామపెద్దలు తెలిపారు.

కుందుర్పి: మండలం ఎనుములదొడ్డిలో ఈనెల 29న పెద్ద సరిగెత్తు, 30న జలధి నిర్వహించనున్నట్లు సర్పంచ్ విజయ్‌కుమార్ తెలిపారు. ఆదివారం వైస్ ఎంపీపీ బీజప్ప, మాజీ ఉప సర్పంచ్ ఖాసీం నాయకులు తిప్పేస్వామి, బొమ్మలింగ, నరసింహప్ప తదితరులు పూజలు నిర్వహించారు.


రాయదుర్గంటౌన్: లడ్డు పీర్ల చావిడిలో వెలసిన పీర్లు


గుమ్మఘట్ట: కలుగోడులో కొలువుదీరిన పీర్లు


కూడేరు: భక్తులు వితరణ చేసిన పీర్, బుర్రా బాబాయ్య పీర్లు

పీర్ల దేవుళ్ల ప్రతిమల వితరణ

కూడేరు: కూడేరుకు చెందిన బుర్రా ఎర్రిస్వామి సోదరులు సుమారు రూ.35 వేలతో పంచలోహలతో తయారు చేసిన బుర్రా బాబయ్య పీర్ల దేవున్ని, గ్రామ యూత్ రూ.35 వేలు విలువ చేసే కబడి పీర్ పీర్ల దేవుళ్ల ప్రతిమలను మొక్కుగా పీర్ల చావిడిలో ఆదివారం వితరణ చేశారు. ముజువార్ పీర్ల ప్రతిమలకు ప్రత్యేక చదివింపులు చేశారు. చాకలి మల్లికార్జున, చాకలి రామాంజనేయులు సుమారు రూ.5 వేలతో పీర్ల చావిడి ముందు భాగంలో శాశ్వతంగా వెలుతురు వచ్చేలా హెడ్‌లైట్స్ ఏర్పాటు చేయించారు.

నేటి నుంచి లాలుస్వామి పీర్లదేవుని ఉత్సవాలు

కణేకల్లు: మండలంలోని ఎస్.హనుమాపురంలో లాలుస్వామి పీర్లదేవుని ఉత్సవాలు సోమవారం ప్రారంభం కానున్నాయి. 29వ తేది జలధి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయకమిటీ అధ్యక్షుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు పైనేటి తిమ్మప్ప చౌదరి తెలిపారు. కొత్తగా నిర్మించిన విడిది భవనాలను భక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఈనాడు విలేకరిపై చర్యలు తీసుకోండి

బొమ్మనహాళ్: మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో రస్తాను అక్రమించిన ఈనాడు దినపత్రిక విలేకరి వెంకటేశులుపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలోని హులిగమ్మ దేవాలయం వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈనాడు దినపత్రిక విలేకరి వెంకటేశులు రోడ్డును అక్రమించి మరుగుదొడ్లు, రేకుల బంకు ఏర్పాటు చేసుకుని గ్రామస్తులను ఇబ్బంది పెడుతున్నారన్నారు. శనివారం పంచాయతీ, రెవెన్యూ అధికారులు వచ్చి సర్వే చేపట్టి రోడ్డు, డ్రైనేజీని ఆక్రమించి మరుగుదొడ్లు, రేకుల బంకులను ఏర్పాటు చేసినట్లు నిర్ధారణ చేసిన తర్వాతే రేకుల బంకులను గ్రామస్తులంతా ఏకమై తొలగించామన్నారు. మరుగుదొడ్లను మూడు రోజుల్లో తొలగిస్తామంటూ అధికారులను ఈనాడు వెంకటేశులు, కుటుంబ సభ్యులు వేడుకున్నారన్నారు. అందుకోసమే మరుగుదొడ్లను తొలగించలేదమన్నారు. కానీ ఈనాడు దినపత్రికలో తప్పుడు రాతలు రాశారని మండిపడ్డారు. విప్ కాపు రామచంద్రారెడ్డిపై వార్తలు రాసినందుకే కక్షకట్టి రేకుల బంకులను తొలగించారని రాయడంపై మండిపడ్డారు. బ్రిటిష కాలం నుంచి ఉన్న 35 అడుగుల రస్తాను ఆక్రమించిన విలేకరి వెంకటేశులు తన పలుకుబడి, రాజకీయ అండదండలతో 15 ఏళ్లుగా రస్తా లేకుండా మరుగుదొడ్లు, రేకుల బంకులను ఏర్పాటు చేసుకున్నారన్నారు. ఇన్నేళ్లు ఈనాడు దినపత్రికలో విలేకరిగా ఉండి ఎన్నో అక్రమాలకు పాల్పడ్డావన్నారు. ఎస్సీలకు ఇచ్చిన స్థలాలు, ప్రభుత్వ భూములను ఆక్రమించిన విషయం మర్చిపోయావా అని ప్రశ్నించారు. ఈనాడు వెంకటేశులు చేసిన అవినీతిపై పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయిందన్నారు. ఈనాడు యజమాన్యం వెంటనే వెంకటేశులుపై చర్యలు తీసుకుని బొమ్మనహాళ్ మండల విలేకరిగా తొలగించాలని వారు డిమాండ్ చేశారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఉద్దేహాళ్ గ్రామస్తులు